క్లుప్తంగా

కిశోర బాలికలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

నగరి: మున్సిపల్ పరిధిలోని చింతలపట్టిడలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో మాసికా మహోత్సవ ఫెస్టివల్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కిశోర బాలికలతో మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు శానిటరీ ప్యాడ్స్ వినియోగించడం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఎస్.శంకరమ్మ, ఎంఎస్‌కే అలేఖ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలో డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచారు. అలాగే ఆలయ ఆవరణలోని పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

కౌంటింగ్ నిబంధనలు పాటించాలి



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి

నగరి: కౌంటింగ్ నిబంధనలను రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ భద్రతా ఇన్‌చార్జ్ డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన అన్ని పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, కౌటింగ్‌లో పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నగరి నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ పుత్తలపట్టు ఆర్‌కేఎం లా కాలేజీలో జరుగుతుందన్నారు. కౌంటింగ్‌లో 14 టేబుల్స్ ఉంటాయని తెలిపారు. టేబుల్‌కు ఒకరు చొప్పున ఏజెంట్లను నియమించుకోవచ్చన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ముగ్గురు ఏజెంట్లను నియామకం చేసుకోవచ్చన్నారు. ఇలా పోటీ చేసిన ఒక్కో అభ్యర్థి 17 మంది ఏజెంట్లను నియమించుకోవచ్చని తెలిపారు. కౌంటింగ్ నియమావళిని పార్టీల నేతలకు సవివరంగా తెలియజెప్పారు. సమావేశంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలకు లోబడే బిల్లుల చెల్లింపు

తిరుపతి తుడా: తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ (తుడా) పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్నికల నిబంధనలకు లోబడే చెల్లింపులు చేపట్టామని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ పేర్కొన్నారు. తుడాలో అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపుపై తుడా అధికారులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని కూటమి నేతలు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉన్నత స్థాయి అధికారుల సూచనలు, ఎన్నికల నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాకే బిల్లులు చెల్లిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికల కోడ్‌కు ముందు 2022–23 ఏడాదిలో టెండర్ ప్రక్రియ పూర్తిచేసుకొని పనులు ప్రారంభించినవి, పూర్తిచేసున్న అభివృద్ధి పనులకు మాత్రమే బిల్లుల చెల్లింపులు చేపట్టామన్నారు. తుడకు సమకూరుతున్న నిధులకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ఇందులో ఎక్కడా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించలేదని ఆయన స్పష్టంచేశారు. కోడ్ వచ్చిన తర్వాత కొత్త పనులు ఆహ్వానించినా, ప్రారంభించినా అలాంటి వాటికి ఎన్నికల నిబంధనలు వర్తిస్తాయని ఆయన చెప్పారు.

ఆదాయం బాగు..
ఆయిల్‌పామ్ సాగు

అంతర్జాతీయంగా మారిన సమీకరణాల వల్ల మలేషియా వంటి దేశాల నుంచి పామాయిల్ దిగుమతులపై ఆంక్షలు విధించడంతో స్థానికంగా పండే ఆయిల్‌పామ్‌కు డిమాండ్ పెరిగింది. ఈ చెట్టు పల్ప్ నుంచి వచ్చేది పామాయిల్ అయితే కెర్నల్ నుంచి తీసే నూనెను కాస్మొటిక్స్‌కు వాడతారు. కెర్నల్ బయో డీజిల్‌గా కూడా వాడుతారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా దీనికి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

- ప్రయోగాత్మకంగా ఆయిల్‌పామ్ పంట సాగు
- ముందస్తుగానే రైతులతో అగ్రిమెంట్ చేసుకుంటున్న కంపెనీలు
- దిగుబడి అందించగానే ఖాతాలకు చేరుతున్న సొమ్ము
- లాభాల పంటగా నిలుస్తున్న ఆయిల్ పామ్



ఎం.కొత్తూరు వద్ద సాగులో ఉన్న ఆయిల్‌పామ్



ఆయిల్‌పామ్ చెట్టులో గెలలు

నగరి: ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని, లాభాలు పొందే అవకాశం ఉందని సాగుచేసే రైతులు ధీమాగా చెబుతున్నారు. జిల్లా రైతులతో పెద్దఎత్తున సాగు చేయించేందుకు ఉద్యానవన శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా గోద్రేజ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీతో ఉద్యాన శాఖ ఎంఓయూ చేసుకుంది. ఈ సంస్థ చిత్తూరు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు పనిచేయనుంది. నర్సరీలు ఏర్పాటు చేయడం, సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీలు, సాంకేతిక పరిజ్ఞానం అందజేయడంతోపాటు పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా వారే ఆయిల్‌పామ్ గెలలను రైతుల వద్ద నుంచి సేకరిస్తారు.

250 ఎకరాల్లో సాగుకు ప్రణాళిక..

జిల్లాలో ఉద్యానవన శాఖ 250 ఎకరాల్లో ఈ పంటను సాగుచేయడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా నగరి నియోజవకర్గంలోని నగరి మండలం ఎం.కొత్తూరు, అర్జునప్ప కండ్రిగ, వేలావడి, బుగ్గ అగ్రహారం గ్రామాల్లో, విజయపురం మండలం క్షూరికాపురంలో సుమారు 20 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులో ఉండగా మరో 60 ఎకరాలు సాగుకు అనువుగా గుర్తించి పనులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో సాగుకు అనుకూలమైన ప్రాంతాలకు విస్తరించాలని ఉద్యానశాఖ కృషి చేస్తోంది. వరి, వేరుశనగ లాంటి సంప్రదాయ పంటలు సాగుచేసి దిగుబడి వచ్చే సమయంలో గిట్టుబాటు ధర కోసం ఆరాట పడుతూ ఉండాలని.. కానీ ఈ పంటలో ఆ బాధలు లేవని దిగుబడి రావడంతోనే కంపెనీ ప్రతినిధులు వచ్చి తీసుకుపోతారని, నగదును మన ఖాతాల్లోకి జమచేస్తారని రైతులు చెబుతున్నారు. మినిమమ్ సపోర్ట్ ప్రైజ్ ఉంటుంది కనుక రైతుకు నష్టాలు వచ్చే ఆస్కారం లేదని ఉద్యానవన శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఒకరిని చూసి ఒకరంటూ ఈ పంట సాగుగు పలువురు రైతులు ముందుకు వస్తున్నారు.

ఒక సారి సాగుతో 25 ఏళ్ల వరకు పంట..

నేలను సాగుచేసి మొక్కలను తెచ్చి రైతులు నాటుకోవాల్సి ఉంటుంది. రూ.133 పలికే ఈ మొక్కలను ప్రభుత్వం సబ్సిడీపై ఉచితంగా అందిస్తోంది. 25 ఏళ్ల జీవిత కాలం ఉండే ఈ చెట్లు నాలుగేళ్ల నుంచి దిగుబడిని ఇస్తుంది. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి యాజమాన్యం సమృద్ధిగా పాటిస్తూ చెట్టు వద్ద తేమను ఉంచడం, అప్పుడప్పుడూ కలుపు తీసి ఎరువులు వేయడం మాత్రమే రైతు చేయాల్సి ఉంటుంది. జనవరి నుంచి తొలకరి వచ్చే వరకు చెట్టుకు నీరందించడంపై ఎక్కువ శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. ఆపై వర్షాలతో తేమ ఉంటుంది కనుక నీటి ఖర్చులు ఎక్కువగా ఉండవు. ఇలా చేస్తూ పోతే ప్రతి నెల స్థిరమైన ఆదాయం ఉంటుంది. చెట్టు పెద్దదయ్యే కొద్దీ దిగుబడి పెరుగుతుంది. ఎకరాకు పది టన్నుల వరకు దిగుబడి ఉంటుంది. తరచూ దున్నే పని లేదు కనుక కూలీల ఖర్చు ఎక్కువగా ఉండదు, చీడపీడల సమస్య ఉండదు. ఎరువుల ఖర్చు తక్కువే అవుతుంది కనుక లాభాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పటి ధర టన్నుకు రూ.17850ని పరిగణనలోకి తీసుకుంటే ఎకరాకు పది టన్నులు సాగుచేసే రైతుకు రూ.1.79 లక్షల ఆదాయం వస్తుంది. పెట్టుబడులు ఎకరాకు రూ.40 వేలు తీసివేసినా రైతుకు రూ.1.39 లక్షల వరకు ఆదాయం వస్తోంది. రైతు సాగుచేసే పంటను బట్టి ఆదాయం పెరుగుతుంది. నెలకు రెండు, మూడు దఫాలుగా దిగుబడి ఉంటుంది. వాతావరణ ప్రభావం ఈ పంటపై ఉండదు. రైతుకు లాభదాయకమైన పంటగా ఆయిల్ పామ్ సాగు మారుతోంది.

రైతును ఆదుకుంటోంది



ఆయిల్‌పామ్ సాగు రైతును ఆదుకుంటోంది. నేను 3 ఎకరాల్లో 190 చెట్లు పెట్టి సాగుచేస్తున్నాను. నాలుగేళ్ల క్రితం ఒక చెట్టు రూ.27 చొప్పున కొన్నాను. మొక్కలు పెట్టి ఆరేళ్లు గడిచింది. ప్రస్తుతం ఎకరాకు టన్ను చొప్పున దిగుబడి వస్తోంది. నెలకు 2 నుంచి 3 సార్లు దిగుబడి వస్తోంది. గోద్రెజ్ కంపెనీ నాతో ఒప్పందం కుదుర్చుకున్న మేరకు సంస్థ ప్రతినిధులు దిగుబడిని తీసుకొని వెళ్తారు. దానికి సరిపడా డబ్బులు నా ఖాతాకు జమ అవుతున్నాయి.

–ఎ.ప్రభాకర్, సాగు రైతు, అర్జునప్ప కండ్రిగ



అర్జునప్ప కండ్రిగ వద్ద సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోట

మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యం

తిరుపతి తుడా: తిరుపతి జిల్లాలో పూర్తిస్థాయిలో మాతాశిశు మరణాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. తిరుపతిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో మాతాశిశు మరణాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎదురవుతున్న లోటుపాట్లు పై అధికారుల నుంచి ఆయన వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మాతా శిసు మరణాలను 100 శాతం అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. రాబోవు రోజుల్లో ఒక్క కేసు కూడా ఉండకూడదని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పుత్తూరు ఫుట్‌బాల్ జట్టుకు అభినందనలు



పుత్తూరు ఫుట్‌బాల్ జట్టు సభ్యులతో జయప్రకాష్

పుత్తూరు: రేణిగుంటలో జరిగిన ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పుత్తూరు ఫుట్‌బాల్ డెవలప్‌మెంట్ క్లబ్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో రేణిగుంట జట్టుపై పుత్తూరు జట్టు విజయం సాధించి రూ.15 వేలు నగదు బహుమతితో పాటు, కప్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.జయప్రకాష్ పుత్తూరు జట్టు సభ్యులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ అరక్కోణం, అనంతపురం, శ్రీకాళహస్తి, కడప, తిరుపతి, రేణిగుంట, పలమనేరు, హిందూపురం, చిత్తూరు వంటి హేమాహేమీల జట్లను ఢీకొని విజేతగా నిలిచిన పుత్తూరు జట్టుకు మంచి భవిష్యత్ ఉందన్నారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జట్టు కెప్టెన్ బాలాజీ, సభ్యులు దినేష్, జగదీష్, దిలీప్, శ్రీనివాసులు, ఇసాక్, రవూఫ్, గణేష్, ఉదయ్, చరణ్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

శ్రీరంగరాజాపురం: మండలంలోని తయ్యూరు పాయకట్టు అంకనపల్లెలోని నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజు ఆలయంలో సోమవారం ద్రౌపది కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కార్తికేయన్ అయ్యంగార్ మంత్రోచ్చరణ, మంగళ వాయిద్యాలు, భక్తజన కోలాహలం నడుమ ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. యార్వ వంశస్థులు ద్రౌపది కల్యాణానికి ఉభయదారులుగా... వంశపారపరంగా వ్యవహరించి సంప్రదాయబద్ధంగా అంకనపల్లె కుమ్మర పూజారులు పెళ్లికొడుకు అర్జున వైపు నుంచి వ్యవహరించి, సుబ్బారెడ్డి రాజేష్ రమ్య దంపతులు పీటలపై కూర్చుని దానం చేశారు.మంగళ వాయిద్యాలతో ఆరిమేను తీసుకువచ్చి వివాహ వేదిక పురోహితుల వేదమంత్రాల మధ్య కల్యాణోత్సవ తంతు ముగించారు. పరిసరాల ప్రాంతాల గ్రామస్తులు అమ్మవారికి అక్షింతలు వేశారు. చదివింపులు సమర్పించారు. అనంతరం యార్వ వంశస్థులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యార్వలింగా రెడ్డి, నిర్వాహకులు రామనాథ రెడ్డి దామోదరాచారి, శంకర్ రెడ్డి, పురుషోత్తం వడియాలు, కుమ్మర గణాచార్యులు, గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్కడ పశు వైద్యం అందని ద్రాక్షే

- తూగుండ్రం సర్పంచ్ శ్రీ బాబు వీడియో వైరల్



కుక్క కాటుకు గురైన మేకను తీసుకొచ్చిన తండ్రితో వెటర్నరీ ఆస్పత్రి వద్ద సర్పంచ్ శ్రీబాబు

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పశు వైద్యశాలలో పశు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఈ ఆసుపత్రికి సుమారు ఎనిమిది పంచాయతీల రైతులు పాడి ఆవులు, మేకలు, పొట్టేలు, గొర్రెలను వైద్యం కోసం తీసుకువస్తూ టారు. అయితే ఇక్కడ వైద్యసేవల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు పాడి రైతులు మండిపడుతున్నారు. తూగుండ్రం సర్పంచ్ శ్రీ బాబుకు చెందిన మేకపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. దీంతో సర్పంచ్ తండ్రి మేకను చికిత్స నిమిత్తం తూగుండ్రం పశువైద్యశాలకు తీసుకెళితే..కుక్క కాటుకు మందులు లేవని, ప్రైవేటు మెడికల్ షాపు నుంచి మందులు తెస్తే వేస్తామని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో ఆయన మందులు తీసుకుని తన కుమారుడితోపాటు వచ్చేసరికి ఆస్పత్రికి సిబ్బంది అప్పటికే తాళం వేసి వెళ్లిపోయారు. అప్పటికి సమయం మధ్యాహ్నం 12.30 గంటలు మాత్రమే. సిబ్బంది బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వర్తిస్తున్నారని తాళం వేసి ఉన్న పశు వైద్యశాలను సర్పంచ్ వీడియో తీశారు. సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని మీడియాకు తెలిపారు.

మద్యంబాబులకు జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపిన కేసులో తిమ్మినాయుడుపాళెంకు చెందిన బి.నాగరాజుకు రెండు రోజుల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 15 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. 16 మందిపై తిరుపతి ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

థైరాయిడ్ దడ

- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- చిన్నారులనూ వదలని వ్యాధి
- జీవనశైలి మార్పులే కారణమంటున్న వైద్యనిపుణులు



గర్భిణులకు చికిత్స చేస్తున్న వైద్యురాలు

కాణిపాకం: శరీర జీవక్రియల్ని నియంత్రించే అతి ముఖ్యమైన గ్రంథి థైరాయిడ్. మనిషి వికాస క్రమంలో థైరాక్సిన్‌హార్మోన్ పాత్ర ఎంతో కీలకమైంది. అయితే, ప్రస్తుతం పుట్టిన బిడ్డ నుంచి తొంభై ఏళ్ల వయసు వారికి సైతం థైరాయిడ్ వ్యాధి సోకుతూ దడ పుట్టిస్తోంది. మనిషిని మానసికంగా, శారీరకంగా కుంగదీసే ఈ వ్యాధిపై సమగ్ర అవగాహన ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. సంపూర్ణ అవగాహన, అప్రమత్తతతో థైరాయిడ్ వ్యాధిని జయించవచ్చని వైద్య నిపుణులు సూచిసున్నారు.

జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, 50 పీహెచ్‌సీలు, 14 అర్బన్‌హెల్త్ సెంటర్లు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 8 సీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి ప్రతి రోజూ 15 నుంచి 30 మంది థైరాయిడ్ బాధితులు వస్తున్నారు. రోజుకు సుమారు వంద మంది వరకు చికిత్స కోసం వైద్యులను సంప్రదిస్తున్నారు. జనరల్ ఫిజీషియన్‌తో పాటుగా ఇతర వైద్య నిపుణుల్ని రోజూ సంప్రదిస్తున్న బాధితుల సంఖ్య 250 మందికి పైగా ఉంటుందని అంచనా. జిల్లా ఆస్పత్రికి జనరల్ మెడిసిన్ వైద్య విభాగానికి రోజూ వైద్యం కోసం వచ్చే వారిలో 250 మందిలో 18నుంచి 25 మంది థైరాయిడ్ బాధితులే ఉంటున్నారు.

థైరాయిడ్ గ్రంథి పనితీరు

గొంతు ముందు భాగంలో శ్వాసనాళానికి ఇరుపక్కలా గులాబీ రంగులో ఇంచుమించు సీతాకోకచిలుక ఆకారంలో థైరాయిడ్ గ్రంథి ఉంటుంది. ఇది మెదడులోని పిట్యూటరీ గ్రంథి స్రవించే థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (టీఎస్‌హెచ్) ద్వారా టి–3, టి–4 అనే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. టి–4 అనగా థైరాక్సిన్. ఇది 20 గ్రాముల బరువు ఉండి శరీరంలోని చాలా జీవక్రియల్ని నియంత్రిస్తుంది. శరరీ పెరుగుదల, ఎముకల పెరుగుదల, శరీర ఉష్ణోగ్రత, మానసిక వికాసాన్ని అదుపు చేస్తుంది. వివిధ కణజాలాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ హార్మోన్ ఉత్పత్తికి మన శరీరంలో తగినంత అయోడిన్ అవసరం. రోజుకు 150 మైక్రో గ్రాముల (గుండుసూది తలంత) అయోడిన్ శరీరానికి అవసరం. థైరాక్సిన్‌లో 65 శాతం అయోడిన్ ఉంటుంది. అయోడిన్ పెరుగుదలకు, శక్తి రావడానికి తోడ్పడుతుంది.

థైరాయిడ్ లక్షణాలు

- ఈ వ్యాధి లక్షణాలు క్రమంగా బయటపడతాయి.
- ఈ వ్యాధి వచ్చిన వారిలో హుషారు తగ్గి, అంతకు ముందులేని మందకొడితనం చోటుచేసుకుంటుంది.
- విపరీతమైన అలసట, నడవాలన్నా, పనిచేయాలన్నా ఓపిక ఉండదు. చర్మంలో తడి, నునుపుదనం తగ్గి, ఎండిపోయినట్లు ఉంటుంది.
- కండరాలు ఉబ్బుతాయి. దానివల్ల శరీరం ఉబ్బుగా కనిపిస్తుంది. కొందరు ఉబ్బు కామెర్లుగా భ్రమపడే అవకాశం ఉంది.
- మలబద్ధకం, కండరాలు పట్టేసినట్లు ఉండటం, చర్మం కింద కొవ్వు చేరి బరువు పెరగడం.
- గొంతు బొంగురుగా మారడం, ముఖం గుండ్రంగా కనపడటం, మనిషి మందమతిగా మారడం.
- జీవక్రియ రేటు విపరీతంగా పెరిగి శరీరంలోని అన్ని శక్తి వనరులు ఖాళీ అవుతాయి.
- ఎముకల్లో కాల్షియం తక్కువై పెళుసుబారతాయి. తలమీద వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి.
- కనుబొమ్మల వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి.
- పిల్లలో పెరుగుదల ఉండదు. పిచ్చితనం వస్తుంది.
- లావు అవ్వడం, బరువు పెరగడం, మత్తు, నిద్ర, ఒళ్లునొప్పులు, మలబద్ధకం, స్త్రీలలో రుతుచక్రంలో మార్పులు రావడం, గర్భం రావడం ఆలస్యం కావడం, తరచుగా గర్భస్రావాలు జరగడం తదితర లక్షణాలు గమనించవచ్చు.
- రక్తంలో టి–3, టి–4, టీఎస్‌హెచ్ అనే హార్మోన్లు ఎంతున్నాయో పరీక్షలు చేస్తారు. దీన్నే థైరాయిడ్ ప్రొఫైల్ అంటారు. ఈ పరీక్షలు చేయించడం ద్వారా వ్యాధి ఉందా? లేదా? నిర్ధారణ చేస్తారు.

వ్యాప్తి ఇలా

- ఈ వ్యాధి అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని 90 ఏళ్ల వయస్సు వారికీ రావచ్చు.
- మగవారి కన్నా ఆడవారిలో ఎక్కువగా సమస్య తలెత్తుతుంది.
- ఆడవారిలో 80 శాతం మందికి ఉంటే మగవారిలో 20 శాతం మందికి వస్తుంది.
- జన్యుపర లోపాల వల్ల, తల్లికి ఉంటే బిడ్డకు, వంశపారంపర్యంగా వ్యాధి వస్తుంది.
- అప్పుడే పుట్టిన బిడ్డకు థైరాయిడ్ ఉందో లేదో నిర్ధారణ పరీక్ష చేయించడం చాలా ఉత్తమం.

అశ్రద్ధ వద్దు



థైరాయిడ్ వ్యాధి పట్ల అశ్రద్ధ ఉండకూడదు. లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. మహిళలు, చిన్న పిల్లల పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. సరైన సమయంలో చికిత్స తీసుకోవాలి. గర్భిణులకు వచ్చే థైరాయిడ్ ప్రసవం అనంతరం తగ్గిపోతుంది. వ్యాధి సోకిన వారికి ప్రత్యేకంగా లక్షణాలు కనిపించవు. ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటాయి.

–ఉషశ్రీ, గైనకాలజిస్ట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

ముందుగానే తెలుసుకోవాలి



యాంటీబాడీ టెస్ట్ చేయించుకోవడం ద్వారా థైరాయిడ్ వ్యాధి వచ్చే అవకాశం ఉందా? లేదా? ముందుగానే తెలుసుకోవచ్చు. ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా చూసుకోవడం వల్ల కొంత వరకు థైరాయిడ్ బారినపడకుండా కాపాడుకోవచ్చు. వ్యాధి నియంత్రణే తప్ప నివారణ లేదు. దీనికి జీవితాంతం మందులు వాడాలి. ముందుగానే గుర్తించడం మంచిది.

–షాలిని, గైనకాలజిస్ట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

తిరుపతి సిటీ: స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, కౌంటింగ్ కేంద్రాల్లో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. ఆదివారం పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గంలో బారికేడింగ్ పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, కంట్రోల్ రూమ్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయనతో పాటు రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి, ప్రొబెషనరీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పోలీసు అధికారులు ఉన్నారు.

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం

తిరుపతి క్రైమ్: విధి నిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటుంబ సభ్యులకు చేయూతనిచ్చేందుకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం ఆర్థిక ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్ బాబు సతీమణి మహేశ్వరికి రూ.1,75,000/–లు, హోంగార్డ్ మోహన్ సతీమణి కవితకు రూ.20,000/–లకు చెక్కులను అందజేశారు. శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తుండి అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.1,75,000/–లకు చెక్కులను ఆయన సతీమణి మహేశ్వరికి అందజేసారు. టీటీడీ విజిలెన్స్‌లో విధులు నిర్వహిస్తూం ఉండి అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఎం.మోహన్ కుటుంబ సభ్యులకు రూ.20,000 లకు చెక్కును అందజేశారు.